

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 15వ కథ -

**మాట ఇవ్వడం, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అంత తేలిక కాదు. మా నాన్నకు ఒక మాట ఇచ్చాను. అది తప్పానో లేదో చివర్లో మీకు తెలుస్తుంది.**

పని మనుషుల పేర్లు రంగమ్మ అని, పుల్లమ్మ అని ఉండక్కర్లేదనీ, టీవీల్లో, సినిమాల్లో చూపించే యాస భాష వాళ్ళు మాట్లాడరనీ నాకు చాలా రోజుల క్రితమే జ్ఞానోదయమైంది. ఆరోజుల్లో మా ఇంట్లో నిశ్చల పనిచేస్తుండేది.

నిశ్చల పనిలోకి రాకముందు వాళ్ళ అమ్మ యశోద చేస్తుండేది. యశోద సూపర్ ఫాస్ట్. వేగం ఎక్కువ , శుభ్రం తక్కువ. అరగంటలోనే పనంతా అవగొట్టేసి పక్కింటికెళ్ళిపోయేది. ఎన్నింటికొస్తుందో తెలియదు కానీ నేను మధ్యాన్నంఏ మూడింటికో భోజనానికి వస్తుంటే అప్పుడు తను కూడా భోంచేస్తూ కనిపించేది.

కొన్నాళ్ళ తర్వాత వాళ్లమ్మాయిని తెచ్చి మా ఇంట్లో పనికి పెట్టింది. కొత్త పనమ్మాయి అంటే నాకు గుండెలో గజిబిజి అవుతుంది. అన్నీ మొదటినుండీ నేర్పాలి.

నిశ్చల కు పాతికేళ్ళని వాళ్ళమ్మ చెప్పింది కానీ చూట్టానికి పద్దెనిమిదేళ్ళలాగా కనిపించేది. ఆ అమ్మాయికి పెళ్ళయిందట. భర్త యాత్రా స్పెషల్ బస్సులకు డ్రైవర్ గా చేస్తాడని, కట్నం డబ్బు బాకీ పడడం వలన ఈ పిల్లని అత్తగారు కాపురానికి తీసుకెళ్ళలేదనీ చెప్పింది. కొత్తగా చేరిన నిశ్చలకి శుభ్రం అన్న పదానికి నిర్వచనం తో మొదలు పెట్టి , త్వరలో వ్యాసాలు కూడా రాయించేయాలనీ చీర చెంగు నడుము చుట్టూ గట్టిగా బిగించాను.

నిశ్చల, పేరుకు తగ్గ మనిషి. చూపు ఎక్కడో ఉండేది. ఎక్కడ కూర్చోబెడితే అక్కడే పాతుకుపోయేది. నేనొచ్చి "త్వరగా కానీయ్" అని అరవకపోతే, స్పూనునొక సంవత్సరం పాటు తోమగల నేర్పరి. తన కేది తోస్తే అదే పని తప్ప, నేను వేరే పనిచెప్తే చేసేదే కాదు. మొదట్లో దానికేదో పొగరనీ , అందుకే నా మాట వినడం లేదనీ అపార్థం చేసుకున్నా. తర్వాత్తర్వాత తెలిసింది దాని పద్ధతి.

చీపురు పట్టి టీవీ ముందు నుంచుంటే ఆమెనక్కణ్ణుంచి కదిలించడం ఎవరివల్లా కాదు. సోఫాలో కూర్చుని పాప్ కార్న్ బొక్కుతున్న పిల్లాడితో, ప్రోగ్రాం విశేషాలు చర్చిస్తూ నుంచునేది. వాడు అప్పటికి మూడోక్లాసు చదువుతున్నాడనుకుంటా.

నేను పనికి వెళ్తూ, “అంట్లు తోమేసెయ్యి. ఆ తర్వాత ఇల్లంతా ఊడ్చి తుడిచేసెయ్యి. ఆ తర్వాత అన్నం తిను. రాంపీకి కూడా అన్నం పెట్టు. అప్పటికి డాబా మీద ఆరేసిన బట్టలెండిపోతాయికదా. అవి మడతలు పెట్టు.” అని ఇలా చెప్పి వెళ్ళేదాన్ని.

నేను సాయంత్రం ఇల్లు చేరే సరికి  స్కూలు యూనిఫాం విప్పకుండా, పిల్లాడు టీవీ ముందు కూర్చుని ఉండేవాడు. నిశ్చల కూడా వాడితో పాటు కూర్చుని టీవీ చూస్తుండేది.  ఇద్దరూ ఒకరి కొకరు దోస్తులయ్యారు. పని చెయ్యమని చెప్తే నిశ్చలకన్నా ముందు , వీడు శోకాలు తీసేవాడు. వాళ్ళిద్దరికీ, మా కుక్క కూడా తోడయ్యింది.

“అమ్మా , మేము డాగీని వాకింగ్ కు తీసుకెళ్తాం.”

వాకింగ్ అనగానే కుక్క వచ్చి గొలుసెక్కడుందో వెతుక్కుని తెచ్చుకుంది.

నిచ్చలా రా అంటే ఏ పనిలో ఉన్నా సరే గభాల్న దాన్ని వదిలేసి చేతులు తుడుచుకుని వరండాలో నుంచుంది.

నిశ్చల కూడా వాడితో వెళ్ళడానికి రెడీ అవడం చూసి ,

"ఏయ్, నువ్వెక్కడికే?"

"బాబు కు తోడమ్మగారూ" అని చెప్పి నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే బయటకు వెళ్ళి కాళ్ళకు చెప్పులేసుకుంటోంది.

"బాబూ, నువ్వొక్కడివే డాగ్ ని తీసుకెళ్లు. నిశ్చల వెళ్తే ఇంట్లో పనెవరు చేస్తారు?"

"అమ్మా, ప్లీజమ్మా, ఇప్పుడే వచ్చేస్తాం. ప్లీజమ్మా" అని గడపదాటి లోపలికొచ్చి నన్ను బతిమాలుతున్నాడు.

బయట నిల్చున్న నిశ్చల వంక చూస్తున్నా. మా ఇద్దరి మధ్యా గొడవతో   తనకేమీ సంబంధం లేనట్టు ఎటో చూస్తూ  నిలబడింది.

విసురుగా వంటింట్లోకి వెళ్ళిపోయాను.

వస్తూ వస్తూ చికెన్ తీసుకొచ్చాను. సింక్ లో బండెడు అంట్లున్నాయి. వాటి నుండి నాకవసరమైనవి

నాలుగైదు తోముకుని అన్నం , కూరా , చారూ చేసేద్దామని హడావుడి పడుతున్నా. బయట వాచ్ మేన్ ఫౌంటైన్ దగ్గర లైట్లు వేశాడు. హోం వర్కులు చేసుకునే టైం అయిందేమో అపార్ట్ మెంట్ లో పిల్లలెవరూ కనిపించడం లేదు. .

వీళ్ళెటు పోయారో అంతులేదు. అన్నం అయిపోయింది. చికెన్ ఇంకా పూర్తిగా ఉడకలేదు. ఇంకా ఓ పదినిముషాలు పొయ్యిమీదే ఉండాలనుకుంటుండగా వచ్చేశారు. కుక్క ఎప్పుడూ లేనంత సంతోషంగా నా దగ్గరకొచ్చింది.  వంటింట్లో చికెన్ వాసనలు తనకు బాగా నచ్చాయని, ఆ రోజు వాకింగ్ తనకు గొప్ప అనుభూతినిచ్చిందనీ తోకూపుతూ తన సంతృప్తిని వెలిబుచ్చింది.

'సంబడమే'  అని మనసులో అనుకుని

"ఒరేయ్, ఇంతసేపూ ఎక్కడికెళ్ళార్రా?" అని నేను కోపగించుకునే లోపల

"ఆయ్.. చికెనూ..నిచ్చలా మమ్మీ చికెనొండుతుంది. అయిపోయిందా? తాంక్సమ్మా" అంటూ వంటింట్లోకొచ్చాడు. మట్టికొట్టుకు పోయిన స్కూల్ యూనిఫాం. వాషింగ్ పౌడర్ ప్రకటనలో పిల్లాడి అవతారంతో వాణ్ణి వంటింట్లో చూడగానే నాకు మండి పోయింది.

“స్నానం చేసి రా”   వాణ్ణి కసిరి,

“నిశ్చలా? నువ్వు కుక్క కి స్నానం చేయించు” అన్నాను .

స్నానం అన్న పదం వినగానే కుక్క దీవాన్ కింద దూరింది.

“అమ్మగారూ, నిన్నేగా రాంపీకి స్నానం చేయించాము.  రాత్రి పూట చేయిస్తే , జలుబొస్తది”  అని తన వాదన వినిపించింది నిశ్చల.

“సరే, నువ్వు అంట్లు ఎప్పుడుతోముతావూ,  ఇల్లెప్పుడు శుభ్రం చేస్తావూ, అసలింటికెప్పుడెల్తావూ ?” అన్నాను.

నిశ్చలంగా ఏమీ మాట్లాడకుండా నా కళ్ళలోకి చూస్తూ ఉంది.

ఇంతలో బాబు స్నానం చేసి వచ్చి “అమ్మా,  మా ముగ్గురికీ చికెనేసి అన్నం పెట్టు” అన్నాడు .

‘ట’ పలకడం వొస్తే, అయ్యగారింకెంత అధికారం ఒలకబోస్తారో?

“వేదన్నం లో చికెనేసుకుంటే బాగుంతది.” అని నిశ్చలకు చెప్తున్నాడు.

స్నానగండం దాటేశామని నమ్మకం చిక్కాక, కుక్క బయటికొచ్చి, చికెన్ కావాలని తోకూపింది.

కుక్క తన ప్లేటు దూరంగా హాల్లో ఒక మూలకు జరుపుకుని తింటోంది. దాని చికెనెవరో కాజేస్తారని భయం. వీళ్ళిద్దరూ టీవీ ముందు కూర్చుని భోంచేస్తున్నారు.

ఇల్లంతా చూస్తే విసుగ్గా ఉంది. నిశ్చలకదేం పట్టినట్టు లేదు. బాబుతో కూర్చుని టీవీ లో వచ్చే ప్రోగ్రాం గురించి చర్చలో మునిగిపోయింది.

నేను సాయంత్రం ఓపీ చూద్దామని వెళ్తూ వెళ్తూ నిశ్చలను హెచ్చరించాను.

“నువ్వు త్వరగా తెమిలి ఇంటికెళ్ళు. నేనొచ్చేసరికి ఇల్లు అద్దంలా ఉండాలి.” గంభీరంగా దానితో పలికి

“ఆ హోం వర్క్ అదీ చేసి పడుకో. రేప్పొద్దున్నే పెట్టొద్దు.” వీడిక్కూడా ఒక సూచన పారేశా.

వాళ్ళిద్దరూ ఏ హామీ ఇవ్వలేదు. అయినా నేను బయటికొచ్చేశా.

నేను హాస్పిటల్ నుండి రాత్రి పదకొండింటికి వచ్చేసరికి నిశ్చల, బాబూ ఇద్దరూ హాల్లోనే నేలమీద చెరో పక్కన పడి నిద్రపోతున్నారు. వాడి స్కూలు బాగ్ , బుక్స్ అన్నీ చిందర వందరగా పడేసి ఉన్నాయి. కుక్క పద్ధతిగా తన బెడ్ మీద నిద్రపోతోంది. టీవీ ఒక్కటే మెలకువగా ఉంది.

వంటిల్లు నేను వెళ్లినపుడు ఎలా ఉందో అలానే ఉంది.

వాళ్ళు తినేసిన ప్లేట్లు , కోక్ బాటిల్స్ అదనపు అలంకరణ.

ఆ రోజు ఆదివారం.

ఆదివారం పొద్దున్నే నేనూ బయటికెళ్ళను, వాడూ స్కూలుకెళ్ళాల్సిన పని ఉండదు. నేను సోఫాలో పేపర్ చదువుతుంటే నిద్రకళ్ళతో వచ్చి వళ్ళో కూర్చుని నిద్ర కంటిన్యూ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. వళ్ళోనుండి జారిపోకుండా సర్దుకుని కూర్చుంటూ ఏవో తంటాలు పడుతున్నాడు.

కాసేపు వాడి జుట్టుని ముద్దు చేసి,

“నాన్నా, పరిమళా ఆంటీ వాళ్ళింటికెళ్ళి, నేను రమ్మన్నానని యశోదని పిల్చుకురా” అన్నాను.

“నిచ్చల వాళ్ళ మమ్మీనా?”

“అవును.”

“ఎందుకు?”

“జీతం ఇద్దామనీ”

“నిచ్చలకియ్యి”

“ దానికి లెక్కపెట్టుకోవడం రాదు”

“నేను కౌంత్ చేస్తా.”

“చెప్పిన మాట విను, ఫో..”

“నాకు నిదరొస్తుంది.”

నా వళ్ళో నిద్రపోడానికి తంటాలు పడుతున్నాడు. ఒక నిముషం తర్వాత ఉలికి పడి లేచాడు.

“అమ్మా , నిచ్చల్ని సాలరీ ఇచ్చి పంపేస్తావుకదా” అన్నాడు అనుమానంగా.

ఇంతలో నిశ్చల వచ్చింది. ఇద్దరూ కలిసి కుక్కని తీసుకుని ఆదివారం ఉదయం పదింటికి విహారానికెళ్ళారు.

వాళ్ళటు వెళ్ళగానే, పరిమళ నంబర్ కనుక్కుని ఫోన్ చేసి ఒకసారి యశోదని పంపించమన్నాను.

యశోద రాగానే వీలైనంత కోపంగా విరుచుకు పడ్డాను. 'నాకు ఇంట్లో పని కుదరడం లేదు. నీ పిల్లకు శ్రద్ధలేదు. నువ్వేరా” అని రెండు ముక్కలు చెప్పడానికి బదులు నుంచోబెట్టి కడిగేశాను. ఇల్లెలా తయారయిందో, అంట్లెలా పడేసి ఉన్నాయో , బట్టలెలా చిందరవందరగా ఉన్నాయోచూడమని

లోపలికి తీసుకెళ్ళి మరీ చూపించాను. ఇంటి శుభ్రతపై నాకున్న పాషన్ వివరించాను.ఇల్లు చూసుకోవడానికి అడుగడుగునా అడ్డుపడుతున్న నా ప్రొఫెషనలిజం, మరికొన్ని కారణాలు ఉటంకించాను. అన్ని రసాలు కలబోసి , ఆ స్టైల్ లో, నా టైప్ చిందులు తొక్కాను.

గలగలా మాట్లాడే యశోద మౌనంగా గోడకానుకుని నుంచుంది.

“దానికసలు పని రాదు. చెప్పు, నువ్వొస్తావా రావా?”

ఇంతలో నిశ్చల, బాబు, కుక్క షికారు నుండివస్తున్న అలికిడి అయింది. ఇద్దరూ పిచ్చినవ్వులు నవ్వుకుంటూ లోపలికొచ్చారు.

ఇంట్లోకి రాగానే కాళ్ళకున్న చెప్పులు రెండు వేరు వేరు దిక్కులలో పడేట్లు విసిరి ,

“అమ్మా నిచ్చల బలే నవ్విపిస్తుందమ్మా” అంటూ పొట్టపట్టుకుని పడీ పడీ నవుతున్నాడు.

ఇంట్లో సీన్ కాస్త సీరియస్ గా ఉండడం గమనించి సైలెంట్ గా నా పక్కకొచ్చి నిలబడ్డాడు.

“ఈ పిల్ల చూస్తే వెర్రిబాగుల్ది. ఈ తెలివి తక్కువదాన్ని ఎవరింటో బడితే ఆళ్ళింటో పనికి పెట్టలేనాయె. మీరైతే కాస్త కడుపులో పెట్టుకుంటారని. ఆళ్ళ అత్తగారోళ్ళు కాపరానికి తీసుకెళ్ళేవరకూ కాస్త మీ దగ్గరే చెయ్యనియ్యండమ్మా. అవసరమైతే నేనూ ఓ చెయ్యేస్తా. " యశోద చెప్పడం మొదలు పెట్టింది. చెప్పి కళ్ళూ ముక్కూ చీరకొంగుతో తుడుచుకుంటోంది

యశోద అలా ఏడవడం చూసి, బాబు పెద్ద,పెద్ద కళ్ళతో ఆమెనే చూస్తున్నాడు.

"ఏం చేస్తాడు వీళ్ళాయన ?"

"యాత్రల బస్సుమీద డ్రైవరమ్మా. ఇంటిపట్టున ఉండడు. శబరిమల, తిరపతి, కాసీ ఇట్టా మనుషుల్ని బస్సులో తీసికెళ్తంటాడు. నెలకోపాలి ఇంటికొస్తే గొప్పే. వచ్చినా దీని మొకం చూడనీయదు అత్త రాకాసి. ”

అని చెప్తూనే ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులన్నీ తీసి సర్దుతుంది. నిశ్చల తనకేం పట్టనట్లు బాబు రూంలో అటూ ఇటూ తిరగడం చూసి

“ఏంటే ఇల్లంతా ఈ లెక్కన పెట్టావూ? అమ్మగారనెన్నని చేసుకుంటారు, పని చెయ్యకపోతే ఎట్టా?” అంటూ నిశ్చలను కేకలేసింది యశోద.

వాళ్ళమ్మ మాటలకు నిశ్చల ఏడుస్తూ కూర్చుంది.

నిశ్చల ఏడుస్తుంటే, మా వాడికి నామీద వల్లమాలిన కోపమొచ్చింది. నాదగ్గరకొచ్చి, నాకే వినబడేటట్లు నా చెవిలో “అందర్నీ ఏడిపిస్తావు. పిచ్చి మమ్మీవి.” అన్నాడు.

ఇల్లంతా డ్రామా సెట్టింగ్ లా, నేను విలన్ ని అయిపోయిన ఫీలింగ్ వచ్చేసరికి అప్పటికింక ఆపేశాను. ఆ రోజు మాత్రం ఇంట్లో పని యశోద చేసి వెళ్ళింది. నిశ్చలను తీసేస్తే మా వాడే నా మీద తిరుగుబాటు ప్రకటిస్తాడని భయమేసి నేనూ పెద్దగా మాట్లాడలేదు

అప్పుడప్పుడు లేటైతే నిశ్చల మా ఇంట్లోనే ఉండిపోయేది. రాత్రి పూట బాబు రూం లోనే పడుకునేది. బాబుకి బాగా అలవాటైంది. నిశ్చలను రాత్రిపూట ఉండిపొమ్మని ఏడ్చేవాడు. కొన్నాళ్ళ తర్వాత, నిశ్చల రోజంతా మా ఇంట్లోనే ఉండిపోయింది. వాళ్ళింటికెళ్ళేదే కాదు. ఓ రోజు రాత్రి ఇంటికొచ్చేసరికి, బాబు ఒక్కడే కూర్చుని తన బొమ్మలతో ఆడుకుంటున్నాడు.

"నిశ్చల ఏదీ?" అని అడిగాను

"నిచ్చలా, ఆ..నిచ్చలా వాల్ల పెనిమితి వస్తే వెల్లింది. " అన్నాడు.

"పెనిమిటి ఏంటీ?"

“ పెనిమితి అంటే బర్త, ముగుడూ” అన్నాడు.

“ఎవరు చెప్పారీ మాటలన్నీ ?”

“నిచ్చలే చెప్పింది. వాల్ల పెనిమితితో సినిమాకెల్లింది.”

పెనిమితి, పెనిమితి అంటూ ఆ గదిలోకీ , ఈ గదిలోకీ తిరుగుతున్నాడు బాబు.

మళ్ళీ వచ్చాడు.

“అమ్మా”

'ఊ" అన్నాను వాడితో

“నాన్న నీకు పెనిమితి కదా.”

వద్దంటే ఇక అదే పదం జపం చేస్తాడని మాట్లాడలేదు.

తర్వాత రోజు వేరే పనిమీద అయిదింటికే నిద్రలేచాను.

చాపమీద వళ్ళు తెలియకుండా నిద్రపోతోంది నిశ్చల. వైలెట్ రంగు జార్జెట్ చీర కట్టుకుని ఉంది. జడలో మల్లెలులున్నాయి. ఆ చీర..

ఆ మధ్య ఒక పండక్కి , 'నిశ్చలకు కూడా కొత్త బట్టలు కొనూ' అని మారాం చేసి బాబు కొనిపించిన చీర. జాకెట్ అదీ కుట్టించుకుని ఇక్కడే పెట్టుకుంది. ఆ చీరెందుకు కట్టిందో?

ఎప్పటికో ఏడింటికి ఎండపడుతుంటే నిద్రలేచింది.

“రాత్రి ఎక్కడికెళ్ళావు నిశ్చలా?”

“మా బావొచ్చాడమ్మగారూ” బెరుకు లేకుండా చెప్పింది.

అలా ఒక సారి కాదు , రెండు మూడు సార్లు జరిగింది.

యశోదని పిలిచి చెప్దామనుకున్నాను కానీ, ఆ పిల్ల భర్తతో కలిసి బయటికెళ్తే తప్పేంటీ అనుకుని చెప్పలేదు.

ఓ రోజు నిశ్చల రాలేదు. పరిమళకు ఫోన్ చేస్తే యశోద కూడా రాలేదని తెలిసింది. కాసేపటికి తనే ఫోన్ చేసింది. నిశ్చల భర్త వెళ్ళే బస్ కొండమీద నుండి పడిపోయిందనీ, అతడు అక్కడి కక్కడే మరణించాడని.

రెండు మూడు వారాల తర్వాత నిశ్చల వచ్చింది. నాలుగైదు కిలోల బరువు తగ్గిపోయినట్లుంది. నిశ్చల వచ్చిందన్న బాబు సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. తను మునుపటి నిశ్చలలా లేదు. జీవితం మాష్టారు చేతిలో దెబ్బతిని, పెద్దరికం తెచ్చుకుని కుదురుగా ఎలా ఉండాలో నేర్చుకున్నట్టుంది.

ఒక మధ్యాహ్నం యశోద వచ్చి ఏం జరిగిందో చెప్పింది.

“అంత జరిగినా ఆళ్ళత్తగారికి దీని మీద జాలిలేదమ్మా. దీన్నసలు ఆ ఇంట్లోకి అడుగే పెట్టనీయలా. దీనిదే శని పాదమనీ, దీన్ని పెళ్ళిచేసుకున్నందుకే ఇలా ఘోరం జరిగిందనీ నానామాటలూ అంది. ఎంత బతిమలాడినా శవం దగ్గరక్కూడా పోనీయలేదమ్మా పిల్లని ”

ఆ మాటలు వింటూ నిశ్చల వంక చూశాను. కుదురుగా చీపురుతో హాలు వూడుస్తోంది. మా మాటలు విన్నట్టే ఉంది. దీవాన్ మీద పడేసిన బట్టలు మడతలు పెడుతోంది. ఎప్పుడూలేనంత పద్ధతిగా.

హాస్పిటల్ కు వెళ్ళిపోయాను. రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇల్లంతా అద్దంలా ఉంది.నిశ్చల ఇదివరకులా బాబుతో ఆడుకోవడం లేదు.

అది మారిపోవడం నా వల్లేనని మావాడు నామీద పగ పెంచుకున్నాడు. ఎంత ముద్దు చేసినా వినడు.

అది జరిగిన ఓ నెలరోజులకు ,

ఆ రోజు ఉదయం నిశ్చల రాలేదు. అవసరమైన పనులేవో చేసి నేను హాస్పిటల్ కు వెళ్ళిపోయాను.

మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి , యశోద బయట కూర్చుని ఉంది.

నిశ్చల రాలేదని తను పని చెయ్యడానికి వచ్చి ఉంటుందనుకున్నాను.

"ఏంటి యశోదా ఇవాళ నిశ్చల రాలేదే " అని అడిగి తాళం తీసి లోపలికెళ్ళాను. నావెంటే వచ్చింది.

ఇంటిపనేదో తను చేసుకుంటుందిలే అనుకుని నేను లోపలికి వెళ్ళి పడుకున్నాను. రాత్రి కేస్ వల్ల నిద్రలేదు. ఓ పదినిముషాల తర్వాత నిద్ర మెలకువ వచ్చింది. లేచి హాల్లోకి వస్తే, యశోద గోడకానుకుని కూర్చుని ఉంది.

ఏదో జరిగింది. నాతో మాట్లాడదామని వచ్చింది. నన్ను నిద్ర లేపడం ఇష్టం లేక అలాగే కూర్చుని ఉంది.

"ఏమైంది యశోదా?"

కొంగు నోటికడ్డం పెట్టుకుని కుమిలిపోతోంది.

“అరే అలా ఏడిస్తే ఎలా , ఏమైందీ?”

“పొద్దుణ్ణుంచీ వాంతులు చేసుకుంటంది పిల్ల. కడుపొచ్చిందని అనుమానంగా ఉంది.” వెక్కివెక్కి ఏడుస్తుంది.

“అదేంటి?”.

“ఏవోనమ్మా, ఏడ తప్పు చేశావో చెప్పమంటే చెప్పట్లేదమ్మా. మీరే గదమాయించి కనుక్కోవాల.”

“ఛా ఊరుకో. వాంతులంటే ఇక అదేనా. నువ్వూ నీ అనుమానమూ. సాయంత్రం దాన్ని హాస్పిటల్ కు తీసుకురా.”

“అంటే కడుపు లేనట్టేనా అమ్మా.” గొంతులో ఆశ.

“పాపం అది ఉట్టి పిచ్చిది యశోదా.దానిమీదా నీ అనుమానం? ”

సాయంత్రం హాస్పిటల్ కు వెళ్ళబోయేముందు బాబు నేల మీద కూర్చుని హోం వర్క్ చేస్తున్నాడు. వాడు చూడకుండా టీవీ రిమోట్ నా బాగ్ లో వేసుకుని, “నాన్నా హోం వర్క్ చేసి అన్నం తిని, తర్వాత ప్రణవి వాళ్లతో కొంచం సేపు ఆడుకో. అప్పుడు మళ్ళీ వచ్చి స్నానం చేసి పడుకో.” అని చెప్పాను.

నేను చెప్పినవేమీ వాడి చెవిలో పడినట్లు లేవు.

బయటకొచ్చి లిఫ్ట్ దగ్గర నిల్చున్నా.

లిఫ్ట్ వచ్చి ఆగింది.

“అమ్మా” అంటూ వాడు బయటకు పరిగెత్తుకొచ్చాడు.

"ఏంట్రా?"

"నాన, ఫోన్ ..లైన్లో ఉన్నాడు"

లోపలికి వచ్చి ఫోన్ మాట్లాడి బయటికి వెళ్తుంటే నాకు తోకలాగా వచ్చాడు. “అమ్మా, నీకు నాన నీకు పెనిమితి కదా,” అన్నాడు.

'వీడీ మాటింకా వదల్లేదే' అనుకుని వాడికి జవాబు చెప్పకుండా ఎటో చూస్తూ ఉన్నా.

గ్లాస్ కాప్సూల్ లిఫ్ట్ లోనుండి, కింద కూర్చున్న పరిమళ, వాళ్ళాయనా కనిపిస్తున్నారు.

“అమ్మా, పరిమలాంతీకి , విశ్వమంకుల్ పెనిమితి కదా” అన్నాడు.

ఎర్రగా చూశా వాడి వంక.

‘బర్త’ అని ఇంకో పర్యాయ పదం చెప్పాడు. చెప్పి నవ్వాడు.

లిఫ్ట్ ఆగింది.

“తప్పు నాన్నా , అలాంటి మాటలు మాట్లాడొద్దు. ” అని వాడికి సీరియస్ గా చెప్పి కారెక్కాను.

కారు యాంత్రికంగా నడపడం అలవాటైంది. బాబు మాటలే గుర్తొస్తున్నాయి. రెండు నెలల క్రితం ఒక సారి నిశ్చల భర్త వచ్చాడు కదా. బ్రేక్ పడింది.

ఆ సంగతి యశోదకు తెలియదా?

హాస్పిటల్ కు వెళ్ళాను. యశోద, నిశ్చల రిసెప్షన్ లో కూర్చుని ఉన్నారు. వేరే వాళ్ళను ముందు చూసేసి చివరగా వాళ్లని పిల్చాను.

నర్సుని పిలిచి నిశ్చలను తీసుకెళ్ళి స్కాన్ దగ్గర పడుకోబెట్టమని చెప్పాను. తీసుకెళ్ళింది.

"యశోదా, మధ్యలో మీ అల్లుడేమైనా వచ్చాడా?" అడిగాను.

"లేదమ్మా, మధ్యలో మనవూర్లో గుండా ఎళ్ళినపుడు ఆగుతాడుగానీ, మనింటికి రాడు. దీన్ని మొకవే చూడడు. ఆళ్ళమ్మ తిడతదని బయం పిల్లగాడికి.” యశోద మాటలు విన్నాక, లేచి స్కాన్ రూం లోపలికెళ్ళాను

స్కాన్ చెయ్యబోతుంటే నాకే కంగారనిపించింది.

“నిశ్చలా, ఆ మధ్యన మీ ఆయన వచ్చాడు కదా, మీ అమ్మకు తెలుసా?”

“ ఓ సారి మాఇంటికొచ్చాడని తెలిసి మా అత్త జగడానికొచ్చింది. కట్నం డబ్బు చెల్లేసేదాకా బావదగ్గరకెల్లొద్దంది మా అమ్మ. ఆ మజ్జెనొచ్చాడని మాయమ్మకు తెలవదు. తెలిస్తే సంపేస్తదని చెప్పలేదు.”

స్కాన్ ప్రోబ్ ఆమె పొట్ట మీద పెట్టాను.

మనం కోరుకునేవి నూటికో, కోటికో జరుగుతాయి. ఒకోసారి జీవితమంతా అయిపోయేవరకూ జరగక పోవొచ్చు. ఎక్కువ సార్లు మనకు ఇష్టం లేనివే జరుగుతుంటాయి. అవసరం లేనివి కొన్ని ఎదురవుతాయి. అక్కర్లేనివి కొన్ని గర్భంలో పెరుగుతుంటాయి.

స్కాన్ ప్రోబ్ కున్న జెల్ తుడిచేసి, యశోదకేం చెప్పాలో, అసలేం చెయ్యాలో అనుకుంటూ బయటికొచ్చాను. బయటికొచ్చి చూస్తే యశోద నిలబడే ఉంది. నేనేం చెప్తానా అని ఆత్రంగా చూస్తూ ఉంది.

"కూర్చో యశోదా"

నా వాలకం , మౌనం చూసి పసిగట్టింది.

"అమ్మా, నేనేం అనను, అడగను. ఈ సంగతి బయట తెలిస్తే అందరం సావాల్సిందే నమ్మా. ఎందుకు.. నా పెనిమిటే దీన్ని సంపేస్తాడు. మొగుడుపోయిన పిల్ల, అల్లరయిపోకుండా చూడండమ్మా" అంటూ దణ్ణం పెట్టి ఏడుస్తుంది.

"సరే , ఊరుకో" అని చెప్పి బెల్ కొట్టి నర్సుని పిలిచాను. ప్రిస్క్రిప్షన్ మీద టేబ్లెట్ల పేరు రాసి అవి తెమ్మన్నాను.

మంచి పనులే చెయ్యాలని మనుషులుగా అందరం కోరుకుంటాం. కానీ, చివరికి మనుగడ కోసం అవసరమైనదే చేస్తాము. మంచైనా, చెడైనా.

నేను చేస్తున్నది తప్పో , ఒప్పో అని ఆ క్షణంలో ఆలోచించలేదు. అప్పటికది అవసరమనిపించింది. తప్పదనిపించింది.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోయి, ఉత్సాహంగా ప్రాక్టీస్ పెట్టబోయే ముందు, నాన్నకో మాటిచ్చాను.

కాదు,కాదు. నాన్న అడిగాడు. నేను సరేనన్నాను.

'చిన్నదైనా, పెద్దదైనా ప్రాణం ప్రాణమేనమ్మా. అబార్షన్లు చెయ్యొద్దు.'

'సరేలే నాన్నా' అని మాటిచ్చేశా. మాట తప్పాను.

నాన్న కిచ్చిన మాట తప్పినందుకు నాకెందుకో బాధగా లేదు.

ఎక్కడో ఉన్న నాన్న అర్థం చేసుకుంటాడని ఎక్కడో ఆశ !

*(వచ్చేనెల మరోకథతో కలుసుకుందాం)*

Post your comments